
# ఘనంగా మాజీ ఎంపీ సంతోష్ బర్త్‌డే

- వెంగళ రావుపార్కులో విద్యార్థులతో కలిసి గ్రీన్‌చాలెంజ్
- జూబ్లీహిల్స్ వేంకటేశ్వరుడి సన్నిధిలో పూజలు
- కేటీఆర్, కవితతోపాటు పలువురి శుభాకాంక్షలు



తన పుట్టినరోజు సందర్భంగా బంజారాహిల్స్ నందినగర్‌లో కేటీఆర్‌ను కలిసిన సంతోష్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా ఉదయం బంజారాహిల్స్‌లోని వెంగళరావుపార్క్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. స్థానిక కార్పొరేటర్ మన్నె కవిత, బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, గ్రీన్ చాలెంజ్ కో ఫౌండర్ రాఘవ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లోని వేంకటేశ్వరస్వామిని సతీసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన సంతోష్‌కుమార్ నందినగర్‌లోని నివాసంలో తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. కీసర రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. మాజీ మంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, సుంకె రవిశంకర్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, సుమిత్రాఆనంద్ తనోబా, పాటిమీది జగన్, చిరుమల్ల రాకేశ్, దూదిమెట్ల బాలరాజు, శుభప్రదపటేల్, మేడె రాజీవ్‌సాగర్, పూర్ణచందర్‌నాయక్, గర్రెపల్లి సతీశ్, శ్రవణ్, రాజు, నారాయణ, షఫీ, సినీనటులు కాదంబరి కిరణ్, జబర్దస్త్ రాకేశ్, జోర్దార్ సుజాత, గాయని వళ్లాల వాణి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా సోదరుడు కేటీఆర్‌ను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని, ఇది నిజంగా తనకు గొప్పరోజు అంటూ సంతోష్ కుమార్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

**భగవంతుడి ఆశీస్సులు ఉండాలి: ఎమ్మెల్సీ కవిత**

సంతోష్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ కవిత ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం సుఖసంతోషాలతో ఉండాలని, నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**గీతాలాపానతో విద్యార్థినుల శుభాకాంక్షలు**

సంతోష్‌కుమార్ జన్మదినం సందర్భంగా పలువురు విద్యార్థినులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా 'పదగతులు.. స్వరజతులు పల్లవించిన నేల.. తేనె తీయని వీణ.. రాగాల తెలంగాణ.. జయగీతికై మోగెరా..' గీతాపాలన చేశారు. గీతాన్ని సంతోష్‌కుమార్ ఎక్స్‌లో పోస్ట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు.



నిజామాబాద్‌లో నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటో షోను ప్రారంభిస్తున్న మేయర్ నీతూకిరణ్, పక్కన ఎస్‌బీఐ డీజీఎం బిజయ్ సాహు, నమస్తే తెలంగాణ ప్రతినిధులు

# అట్టహాసంగా ప్రారంభమైన ఆటో షో

- నిజామాబాద్‌లో కొలువుదీరిన వాహన ప్రదర్శన
- ఒకే వేదికపైకి ప్రముఖ కంపెనీలు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 7: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో షో శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రముఖ వాహన కంపెనీలతో కొలువుదీరిన ఈ ప్రదర్శనను మేయర్ నీతూకిరణ్ ప్రారంభించారు. అనంతరం అన్ని స్టాళ్లను సందర్శించి, అధునాతన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకప్పుడు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన ఆటో షోను నిజామాబాద్ లాంటి నగరాల్లో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. నాలుగోసారి విజయవంతంగా వాహన ప్రదర్శన నిర్వహిస్తున్న నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే యాజమాన్యాన్ని ప్రశంసించారు. రెండురోజులపాటు నిర్వహించనున్న ఆటో షోను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను కోరారు.

తొలిరోజు ఆటో షోకు విశేష స్పందన వచ్చింది. ఉదయం నుంచే సందర్శకులతో కిటకిటలాడింది. ప్రధానంగా మహిళలు ద్విచక్ర వాహనాలు, కార్లు ట్రయల్ చేసేందుకు ఉత్సాహం చూపారు. వాహనాల విక్రయాలు, బుకింగ్‌లు జరగడం ఆయా కంపెనీల సిబ్బందికి సరికొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఎస్‌బీఐ డీజీఎం బిజయ్ సాహు, ఆర్‌ఎం మహేశ్వర్, యూబీఐ ఆర్‌ఎం అరుణ సునీత, డిప్యూటీ రీజినల్ హెడ్ ప్రవీణ్ వేణుగోపాలన్, నమస్తే తెలంగాణ నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ ధర్మరాజు, ఎడిషన్ ఇన్‌చార్జి లక్మ రమేశ్, బ్యూరో ఇన్‌చార్జి జూపల్లి రమేశ్, ఏడీవీటీ మేనేజర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యలోనే ప్రపంచాన్ని మార్చే శక్తి

## నల్సార్ లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణదేవరావ్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ) : ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యలోనే ఉందని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్స్‌లర్ కృష్ణదేవరావ్ అన్నారు. శనివారం ఏపీలోని గుంటూరు జిల్లా చేబ్రోలులోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విదార్థులు నేర్చుకున్న విజ్ఞానాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాలని సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వర్సిటీ వీసీ నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లోకి ఓఆర్ఆర్ గ్రామాలు

## విలీనానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ విలీనానికి సంబంధించిన ఆర్డినెన్స్‌పై ప్రభుత్వ వాదనలను హైకోర్టు ఆమోదించింది. విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ పలు గ్రామాల ప్రజలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. ప్రభుత్వ ఆర్డినెన్స్ ప్రకారమే విలీన ప్రక్రియ సాగుతుందని చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు గెజిట్ విడుదల చేసింది.

# ఆరోగ్యం..మల విసర్జన తీరు కీలకం

- *మలబద్ధకం, అతిసారం రెండూ సమస్యే*
- *అమెరికా పరిశోధకుల అధ్యయనం*



*న్యూయార్క్, డిసెంబర్ 7: మల విసర్జన గురించి బయటకు మాట్లాడటానికి కూడా ఎవరూ పెద్దగా ఇష్టపడరు. అయితే, మన ఆరోగ్య పరిస్థితి, జీర్ణక్రియ, గట్ హెల్త్(జీర్ణాశయ వ్యవస్థ ఆరోగ్యం), సాంక్రమిక వ్యాధులు చాలావరకు మల విసర్జన తీరుపైనే ఆధారపడి ఉంటుందని అమెరికాకు చెందిన పరిశోధకులు చెప్తున్నారు. సియాటిల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీ(ఐఎస్‌బీ) పరిశోధకులు చేసిన అధ్యయనం వివరాలు 'సెల్ రిపోర్ట్స్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 3,600 మందిని నాలుగు విభాగాలుగా విభజించి వీరు స్టడీ చేశారు. మలబద్ధకం విభాగంగా, వారానికి మూడు నుంచి ఆరుసార్లు పోయేవారిని లో-నార్మల్ కేటగిరిగా, రోజుకు ఒకటి నుంచి మూడుసార్లు పోయేవారిని హై-నార్మల్ కేటగిరిగా, రోజుకు నాలుగుసార్లు, అంతకంటే ఎక్కువసార్లు మల విసర్జన చేసే వారిని డయేరియా కేటగిరిగా విభజించారు.*

***అధ్యయనంలో తేలిన అంశాలు:***

- *ఒక రోజులో మూడుసార్లు లేదా వారానికి మూడు, నాలుగుసార్లు మల విసర్జన చేయడం సాధారణమే. మలబద్ధకం, డయేరియా(అతిసారం) ఉంటే మాత్రం ఏవో అనారోగ్య సమస్యలు ఉన్నాయని సంకేతాలుగా అర్థం చేసుకోవచ్చు.*
- *అపక్రమ మల విసర్జన అలవాట్లకు తోడు నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలు ఉండటం ఇతర జీవక్రియ రుగ్మతలకు ముందస్తు హెచ్చరిక సంకేతాలు కావొచ్చు.*
- *మల విసర్జన షెడ్యూల్‌తో జీవ నాళంలోని బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులతో కూడిన మైక్రోబయోమ్ ఆరోగ్యానికి సంబంధం ఉంటుంది. ఆరోగ్యకరమైన మైక్రో బయోమ్ జీర్ణక్రియను మెరుగుపర్చడంతో పాటు మల విసర్జన సక్రమంగా ఉండేలా చేస్తుంది. రోగ నిరోధక శక్తికి మద్దతుగా ఉంటుంది.*
- *అసాధారణ మల విసర్జన సమస్యలు ఉండటం టైప్ 2 మధుమేహం, ఊబకాయం, గుండె జబ్బుల ముప్పును పెంచుతుంది.*

# అనారోగ్య కారణాలతోనే శైలజ మృతి

- రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 7 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ అనారోగ్యంతోనే మృతి చెందిందని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పలు పాఠశాలలను సందర్శించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో విద్యావ్యవస్థ బలోపేతం, మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. శైలజ ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందలేదని, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్‌ఎంపీ వద్ద చికిత్స తీసుకుందని, దీంతో మరింత ఆరోగ్యం క్షీణించిందని తెలిపారు.

# మహాయుతికి విపక్షాల షాక్!

## ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం బహిష్కరణ

ముంబై: మహారాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. తాజా ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే అధికార మహాయుతి కూటమి ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ఎమ్మెల్యేలు బహిష్కరించినట్లు శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే చెప్పారు. శాసన సభ ఎన్నికల్లో ఈవీఎంల దుర్వినియోగానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈవీఎంలను ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని మండిపడ్డారు. ఇది ప్రజా తీర్పు కాదని, ఎన్నికల కమిషన్, ఈవీఎంల తీర్పు అని ఆరోపించారు. తమ కూటమి ఎమ్మెల్యేలు ప్రత్యేక సమావేశాల తొలి రోజు ప్రమాణ స్వీకారం చేయరని వివరించారు. ఈ పరిణామాలపై మహాయుతిలోని ఎన్సీపీ నేత ఛగన్ భుజ్‌బల్ స్పందిస్తూ, ప్రమాణ స్వీకారాన్ని వ్యతిరేకించకూడదని, సభా కార్యకలాపాల్లో పాలుపంచుకోవాలంటే, ప్రమాణ స్వీకారం చేయవలసి ఉంటుందన్నారు.

# అజిత్‌కు ఊరట

## బినామీ ఆస్తుల కేసు కొట్టివేత

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు భారీ ఊరట లభించింది. 2021లో స్వాధీనం చేసుకున్న రూ. 1,000 కోట్ల విలువచేసే ఆస్తులను ఆదాయం పన్ను శాఖ శనివారం విడుదల చేసింది. అజిత్ పవార్, ఆయన కుటుంబ సభ్యులు బినామీ ఆస్తులను సంపాదించుకున్నారని వచ్చిన ఆరోపణలను ప్రివెన్షన్ ఆఫ్ బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కొట్టి వేసింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్ ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే ఈ తీర్పు రావడం గమనార్హం. తీర్పుపై అజిత్ పవార్ స్పందిస్తూ అప్పీలు చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని అన్నారు. కాగా..బినామీ ఆస్తులను కలిగి ఉన్నారన్న ఆరోపణలపై 2021 అక్టోబర్ 7న అజిత్ పవార్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన అనేక ప్రదేశాలపై ఐటి శాఖ దాడి చేసింది. సతారాలో ఒక చక్కెర ఫ్యాక్టరీ, ఢిల్లీలో ఒక ఫ్లాట్, గోవాలో ఒక రిసార్టుతోసహా అనేక ఆస్తులను ఐటి శాఖ స్వాధీనం చేసుకుంది. అయితే ఈ ఆస్తులలో ఏవీ అజిత్ పవార్ పేరిట లేవని దర్యాప్తులో వెల్లడైంది. సరైన ఆధారాలు లేవన్న కారణంతో అజిత్ పవార్‌పైన వచ్చిన ఆరోపణలను ట్రిబ్యునల్ తోసిపుచ్చింది.

